## క్లుప్తంగా

### విజ్ఞాన్ నిరులలో అవగాహన సదస్సు



గుంటూరు రూరల్: మండలంలోని పెదపలకలూరు రోడ్డులోగల విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో అమరావతి క్వాంటమ్‌వాలి 2025 హాకథాన్‌పై గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న అవగాహన సదస్సు శుక్రవారంతో ముగిసింది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి. రాధిక మాట్లాడుతూ అవగాహన సదస్సులు, వర్క్‌షాపుల వల్ల విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయవచ్చన్నారు. తద్వారా విద్యార్థులు నూతన విషయాలను గ్రహించి లక్ష్య సాధనకు కృషిచేస్తారన్నారు. ఈ ఆన్లైన్ బూట్ క్యాంప్‌లో విద్యార్థినులు క్వాంటమ్ సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పొందినట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఘనంగా మెగాస్టార్ జన్మదిన వేడుకలు



గుంటూరు రూరల్: మండలంలోని గోరంట్ల గ్రామంలోగల కాపు హాస్టల్‌లో మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాపునాడు ఎడిటర్ మారిశెట్టి మురళి పాల్గొని కేక్ కట్‌చేసి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో హాస్టల్ ఇన్‌చార్జ్ బలిశెట్టి విజయ్‌కుమార్, జి.వి.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

### ప్రాంగణ ఎంపికల్లో ఆర్‌వీ ఆర్‌జేసీ విద్యార్థుల ప్రతిభ



గుంటూరు రూరల్: ఆధునిక సాంకేతిక యుగంలో విద్యార్థులకు, నైపుణ్యాలే ఉద్యోగ సాధనకు ప్రధాన మార్గమని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీ మోహన్, డాక్టర్ జగదీష్‌లు పేర్కొన్నారు. శుక్ర వారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో డెల్టాఎక్స్ కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో ఇద్దరు విద్యార్థులు రూ 7 లక్షల రూపాయల ప్యాకేజీతో ఉద్యోగాలకు అర్హత పొందారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణ ప్రసాద్‌లు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ డెల్టాఎక్స్ సంస్థతోపాటు అనేక దిగ్గజ సంస్థలు తమ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు నిర్వహిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, అధికారులు సి.హెచ్.శ్రీనివాసరావు, డాక్టర్ కె.సురేష్‌బాబులు అభినందించారు.

### ఏఎన్‌యూలో విద్యార్థికి పాము కాటు

పెదకాకాని(ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ విద్యార్థి పాము కాటుకు గురికావడంతో చినకాకాని ఎన్‌ఆర్‌ఐ ఆసుపత్రి తరలించిన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఏఎన్‌యులో ఇంజనీరింగ్ కళాశాలలో నూజివీడుకు చెందిన శ్యాం బీటెక్ ప్రథమ సంవత్సరం విద్యనభ్యసిస్తున్నాడు. గురువారం రాత్రి హాస్టల్‌లో భోజనం చేసి ప్రధాన రోడ్డుపై ఫోన్ చూసుకుంటూ వెళుతుండగా పాము కాటుకు గురయ్యాడు. తోటి విద్యార్థులు వెంటనే చికిత్స నిమిత్తం ఎన్‌ఆర్‌ఐ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం విద్యార్థి ఆరోగ్యం నిలకడగానే ఉందని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. గత ఏడాది కూడా వర్సిటీలో బుద్ధిజం విద్యనభ్యసిస్తున్న మయన్మార్‌కు చెందిన కొండన్న పాము కాటుకు గురై మృతి చెందాడు. పాము కాటు వ్యవహారం గోప్యంగా ఉంచడంపై వర్సిటీలో ఏం జరుగుతుంది, ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారో అనే చర్చ జరుగుతుంది.

# రైతులకు దక్కని యూరియా

- కాంప్లెక్స్ ఎరువులు కరువు
- బ్లాక్‌లో విరివిగా అమ్మకాలు



ఎరువుల బస్తాలు (ఫైల్)

చేబ్రోలు: గత ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అందుబాటులో ఉన్న యూరియా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత యూరియా కొరత రైతుల పాలిట శాపంగా మారింది. ఎరువుల షాపులు, జీడీసీఎంఎస్, సొసైటీలు, షాపుల వద్ద రైతులు యూరియా కోసం పడిగాపులు కాస్తున్నారు. కొద్దిరోజుల క్రితం కురిసిన భారీ వర్షాల వలన పంట నీట మునిగి దెబ్బతింది. ఊరకెత్తిన మొక్కలు కోలుకోవటం కోసం రైతులు ఎరువులను పిచికారీ చేయాల్సి ఉంది. అయితే ఎరువులు అందుబాటులో లేకపోవటంతో రైతులు బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**కూటమి కనుసన్నల్లో ఎరువులు**

మండలానికి ఎరువులు సరఫరా అవుతున్నట్లు లెక్కల చూపుతున్న అధికారులు రైతులకు అందకపోవటానికి అధికారుల అలసత్వమే కారణమని చెప్పొచ్చు. రైతు సేవా కేంద్రాల్లో అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో వచ్చిన అరకొర యూరియాను పక్కదారి పట్టించి జేబులు నింపుకుంటున్నారు. లారీల్లో వచ్చిన బస్తాలను ఎకరానికి బస్తా చొప్పున చెప్పి కొంతమందికి ఎమ్మార్పీ ధర కన్నా ఖర్చుల పేరుతో పది రూపాయిలు అధికంగా తీసుకొని మొక్కుబడిగా ఇచ్చి మిగిలినవి అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో పక్కదారి పట్టిస్తున్నారు.

**15 వేల ఎకరాల్లో వరి సాగు**

చేబ్రోలు మండలంలోని 13 గ్రామాల పరిధిలో సుమారు 15 వేల ఎకరాల్లో వరి సాగు అవుతుంది. మెట్ట, వాణిజ్య, కూరగాయ పంటలు మరో ఐదు వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. యూరియా, కాంప్లెక్స్ ఎరువుల కొరత కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైతుల అవస్థలను కొంతమంది తమకు అనుకూలంగా మలుచుకొని జేబులు నింపుకుంటున్నారు. బస్తాకు వంద నుంచి నూట యాభై వరకు రైతుల నుంచి అదనంగా వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**పర్యవేక్షణ ఏదీ?**

అధికారుల పర్యవేక్షణ లోపం రైతులకు శాపంగా మారింది. చేబ్రోలు మండలంలో రైతులకు అవసరమైన యూరియా, డీఏపీ ఎరువులను సరఫరా చేయడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. కొన్ని షాపులకు వచ్చిన ఎరువులను వ్యాపారులు తమకు అనుకూలంగా మలుచుకొని రైతులను దోపిడీ చేస్తున్నారు. ప్రభుత్వం 50 కిలోల డీఏపీ బస్తాను రూ.1350లకు ఎమ్మార్పీ ధరకు ప్రకటించగా ఎరువుల షాపుల్లో మాత్రం రూ.1450 నుంచి రూ.1500ల వరకు విక్రయిస్తున్నారు.

దీంతో ప్రభుత్వం ప్రకటించిన ధర కంటే రూ.100 నుంచి రూ.150లు అధికంగా రైతులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. యూరియా బస్తా రూ.267లు ఎమ్మార్పీ ధర ఉండగా ఎరువుల షాపుల్లో మాత్రం రూ.350 నుంచి రూ.400లకు విక్రయిస్తున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులు యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులను పిచికారీ చేయాల్సిన దశలో ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవటంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రైతు సేవా కేంద్రాలు, సహకార సంఘాలు, సొసైటీలకు ఎరువులను సరఫరా చేస్తున్నట్లు వ్యవసాయ శాఖాధికారులు ప్రకటిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో స్పష్టత కొరవడింది. అన్ని గ్రామాల్లో రైతు సేవా కేంద్రాలకు యూరియాను సరఫరా చేసినట్లు అధికారులు ప్రకటించినప్పటికీ రైతులకు తెలియకపోవటం గమనార్హం. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్ల మేరకు సరఫరా చేస్తున్న ఎరువులు పక్కదారి పడుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గతంలో ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా గ్రామాల్లోనే రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ప్రభుత్వ ప్రకటించిన ఎమ్మార్పీ రేట్లకు అందజేశారు. ప్రస్తుతం గ్రామస్థాయిలో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో లేకపోవటంతో అన్నదాతలు ఎరువుల కోసం దిక్కులు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. జీడీసీఎంఎస్, రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు అందించే ఎరువులను కొన్ని చోట్ల అధిక ధరలకు విక్రయిస్తున్నారని విమర్శిస్తున్నారు.

### అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

చేబ్రోలు మండలంలోని అన్ని గ్రామాలకు యూరియాను సరఫరా చేసినట్లు ఏవో ప్రియదర్శిని తెలిపారు. రైతు సేవా కేంద్రాలు, చేబ్రోలు, నారాకోడూరు గ్రామాల్లోని జీడీసీఎంఎస్, వేజండ్లలోని సొసైటీల ద్వారా యూరియా, కాంప్లెక్స్ ఎరువులను సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మార్పీ ధరలకు ఎరువులను సరఫరా చేయాలన్నారు. ఎక్కువ రేట్లకు అమ్మితే రైతులను ఫిర్యాదు చేస్తే విచారించి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటి వరకు మండల పరిధిలోని 17 రైతు సేవా కేంద్రాలకు ఎరువులను సరఫరా చేసినట్లు తెలిపారు. 400 టన్నుల యూరియా, 200 టన్నుల డీఏపీని రైతులకు అందజేసినట్లు ఏవో తెలిపారు. మరో రెండు రోజుల్లో పూర్తి స్థాయిలో ఎరువులు అందుబాటులో ఉంటాయన్నారు.

# పింఛన్ల తొలగించడం దుర్మార్గం



నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కిరణ్‌కుమార్

**వైఎస్సార్‌సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గం ఇన్‌చార్జ్ బలసాని కిరణ్‌కుమార్**

గుంటూరు రూరల్: కూటమి ప్రభుత్వం గద్దెనెక్కిన తరువాత నుంచి ప్రతిరోజు పేద ప్రజలు అల్లాడిపోతూనే ఉన్నారని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఏటుకూరు బైపాస్‌లోని నియోజకవర్గం కార్యాలయంలో నియోజకవర్గం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం పేదలను ఆదుకుంటాం... అందలం ఎక్కిస్తాం అంటూ కోతలు కోశారన్నారు. ఎన్నికలు పూర్తయి అధికారం చేపట్టిన అనంతరం అవ్వాతాతలకు ఇవ్వాల్సిన పింఛన్లలో కోతలు విధించారని, అదేవిధంగా దివ్యాంగులకు సైతం పింఛన్‌లను తొలగించారన్నారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇవ్వకుండా నట్టేట ముంచారన్నారు.

మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని నిలువునా ముంచారన్నారు. రైతులకు మద్దతు ధరలు ఇవ్వకుండా రైతులను రోడ్డుపాలు చేశాడని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత రాష్ట్రంలో ఐదులక్షల పింఛన్‌లను తొలగించటం దుర్మార్గమైన చర్యని అగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం నియోజకవర్గ ప్రజలు తన దృష్టికి తెచ్చిన పలు సమస్యలపై స్పందించి, వారికి అన్ని విధాల అండగా ఉంటానని భరోసా కల్పించారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

### విజ్ఞాన్‌లో వరాలమ్మకు వందనం





విజ్ఞాన్ యూనివర్సిటీలో శ్రావణ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రత పూజా మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది, విద్యార్థులు సామూహిక వ్రత పూజలు చేశారు. వైస్ చాన్స్‌లర్ పి. నాగభూషణ్ మాట్లాడుతూ వ్రతమంటే నియమబద్ధమైన నడవడిక, క్రమశిక్షణతో కూడిన ఆచరణ, వ్యక్తిగత జీవితాల్లో ప్రాముఖ్యాన్ని తెలియజెప్పడమే వ్రతం అంతర్యమన్నారు. ఆహ్లాదానికి, ఉత్సాహానికి, ప్రసన్నతకు, చిరునవ్వుకు అమ్మవారు ప్రతీక అని తెలియజేశారు. రిజిస్ట్రార్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు. –చేబ్రోలు

### సంప్రదాయంగా...



గుంటూరు రూరల్: మండలంలోని బుడంపాడు గ్రామంలోగల ప్రాడిజి విద్యాలయంలో శావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా లక్ష్మీపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులకు చిన్ననాటి నుంచి మన సంస్కృతి సాంప్రదాయాలను తెలియజేయటం మన కర్తవ్యమన్నారు. విద్యార్థులు సాంప్రదాయ దుస్తులతో ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులు తెలుగు కవితలు, పద్యాలు వినిపించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సూర్యకుమారి, ప్రిన్సిపల్ వై.రథినిచౌదరి తదితరులు పాల్గొన్నారు.

### భ్రమరాంబ అమ్మవారికి కుంకుమపూజలు



పెదకాకాని: శివాలయంలో భ్రమరాంబ అమ్మవారికి అర్చకులు కుంకుమపూజలు జరిపించారు. పెదకాకాని భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో శ్రావణమాస చివరి శుక్రవారం అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి అధికసంఖ్యలో భక్తులు విచ్చేసి భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్లను దర్శించుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో అంత్రాలయ దర్శనాలు, అభిషేకాలు, అన్నప్రాసనలు, నామకరణలు, వాహనపూజలు, రాహుకేతువుల పూజలు, నవగ్రహ పూజలు అధికసంఖ్యలో జరిగాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలాకుమార్ ఏర్పాట్లు చేపట్టారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నప్రసాదాలు ఏర్పాటు చేసినట్లు డీసీ తెలియజేశారు.

### ఇటోస్తే నడుములు జాగ్రత్త



మండలంలోని నండూరుకు వెళ్లే రహదారి గుంతలతో దారుణంగా మారింది. రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాహన చోదకులు వాపోతున్నారు. రాత్రి సమయాల్లో గుంతలు కనపడక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆ మార్గంలో ప్రయాణించాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని నెలలుగా రోడ్డు అధ్వానంగా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. –పొన్నూరు

## స్కిల్ డిజైర్ టెక్నాలజీస్‌తో ఏఎన్‌యూ ఎంఓయూ

పెదకాకాని (ఏఎన్‌యూ): స్కిల్ డిజైర్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మధ్య ఎంఓయూ జరిగినట్లు వీసి ఆచార్య కె గంగాధరరావు తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రవీంద్రనాథ్ ఠాగూర్ పరిపాలన భవన్ వీసీ ఛేషి లో స్కిల్ డిజైర్ డైరెక్టర్ ఎం శ్రీకాంత్, వీసి ప్రొఫెసర్ కంచర్ల గంగాధర్‌లు శుక్రవారం ఎంఓయు పత్రాలు మార్చుకోవటం జరిగింది. ఈ సందర్భంగా వర్సిటీ వీసీ మాట్లాడుతూ ఈఎంఓయూ లో భాగంగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని విద్యార్థినీ, విద్యార్థులు పరిశోధకులు, అధ్యాపక , అధ్యాపకేతర సిబ్బందికి స్కిల్స్ మెరుగుపడటానికి తోడ్పడుతుందన్నారు. ఉచిత ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం, మాస్టర్ క్లాసెస్, టెక్నికల్ ట్రైనింగ్స్ స్కిల్ డిజైర్ వారు ఉచితంగా అందించనున్నారు. అడ్వాన్స్ స్కిల్స్ పెంపొందించుకోవడానికి ఎంఓయూ ఉపయోగపడుతుందన్నారు. రిజిస్ట్రార్ సింహాచలం మాట్లాడుతూ ప్రాక్టికల్ ల్యాబ్స్‌ను వీరి ద్వారా ట్రైనింగ్ ఇప్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రెక్టార్ ప్రొఫెసర్ రత్న శిలామణి, రిజిస్టర్ ప్రొఫెసర్ జి.సింహాచలం, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సి.హెచ్.లింగరాజు, అసిస్టెంట్ ప్రిన్సిపల్స్ డాక్టర్ ఎం.గోపికృష్ణ, డాక్టర్ డి.చంద్రమౌళి, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎండి తౌసిఫ్ అహ్మద్, మెకానికల్ విభాగపు సమన్వయకర్త డాక్టర్ బి.పూర్ణచంద్రశేఖర్, ట్రిబుల్ ఈ విభాగపు సమన్వయకర్త డాక్టర్ ఉమామహేశ్వరి, ఈసీఈ విభాగపు సమన్వయకర్త డాక్టర్ డి.అఖిల జాన్, సీఎస్ఈ విభాగం సమన్వయకర్త డాక్టర్ సతీష్, ఏఐఎంఎల్ విభాగపు సమన్వయకర్త డాక్టర్ కొండా చైతన్య, ఎస్ అండ్ హెచ్ విభాగపు సమన్వయకర్త డాక్టర్ ఎడ్ల సునీత, తదితరులు పాల్గొన్నారు.

### జీవితంలో ఎదిగేందుకు చదువొక్కటే మార్గం



యూనిఫాం పంపిణీ చేసిన విద్యార్థినులతో డాక్టర్ చైతన్య, అధ్యాపకులు

**వైద్యురాలు మున్నంగి చైతన్య**

గుంటూరు రూరల్: జీవితంలో ఎదిగేందుకు చదువొక్కటే మార్గమని ప్రముఖ వైద్యురాలు మున్నంగి చైతన్య సూచించారు. శుక్రవారం మండలంలోని అంకిరెడ్డిపాలెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ జూనియర్ కళాశాల విద్యార్థినులకు యూనిఫాం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వాలు అందించే అవకాశాలు, దాతలు అందించే ఉపకారాలను కూడా సద్వినియోగం చేసుకొని ఉన్నత విద్య చదవాలనుకునే వారు తమ లక్ష్యాన్ని చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రధానోపాధ్యాయురాలు చావలి సరోజిని మాట్లాడుతూ పాఠశాలలో ఏర్పాటు చేసిన సౌకర్యాలు, సదుపాయాలు దాతల సహకారంతో ఏర్పాటు చేసినవేనని వారికి ఎల్లప్పుడూ ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కమిటీ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు యూనిఫాం పంపిణీకి సహకరించిన దాత సింహాద్రి శివారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. మున్నంగి హైస్కూలు అధిపతి లక్ష్మీ నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించి తమ కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందేలా కృషి చేయాలన్నారు. తద్వారా సమాజంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకోవాలని సూచించారు. పాఠశాలలో మెరుగైన సౌకర్యాలు కల్పించటమే కాకుండా నాణ్యమైన విద్యను అందించటానికి మా కమిటీ కృషి చేస్తుందని, వాటిని అందిపుచ్చుకుని ఉపాధ్యాయులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకున్నప్పుడే దాతల దాతృత్వానికి తగిన విలువ, గౌరవం లభిస్తుందని విశ్రాంత వ్యాయామ అధ్యాపకుడు మున్నంగి సంజీవరెడ్డి చెప్పారు. విద్యార్థినిలకు యూనిఫాం, నగదు పంపిణీ అనంతరం అతిథులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కుర్రా సాంబిరెడ్డి, వీరగంగాధరరెడ్డి, కుర్రా పుల్లా రెడ్డి, స్టాఫ్ సెక్రటరీ హనుమంత రావు, ఉపాధ్యాయులు శ్రీనివాస రావు, శాంతిప్రియ, శివపార్వతి, అరుణ, చంద్రమౌళి, ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

### బాజీబాబా దర్గాలో వ్యక్తి మృతి

పెదకాకాని: బాజీబాబా దర్గా ఆవరణలో వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు గ్రామానికి చెందిన చేబ్రోలు రామ్మోహన్ 12 ఏళ్ళ క్రితం ఇంటి నుండి వచ్చి పెదకాకాని బాజీబాబా దర్గా వద్దే ఉంటున్నాడు. అనారోగ్యానికి గురైన రామ్మోహన్ (64) మృతి చెందాడు. గమనించిన చుట్టుప్రక్కల వారు దర్గా నిర్వాహకులకు సమాచారం ఇచ్చారు. ట్రస్టు సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.

# కొత్త ఆవిష్కరణలతో యువతకు అవకాశాలు

- అనంత్ టెక్నాలజీస్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సుబ్బారావు
- విజ్ఞాన్‌లో ఘనంగా నేషనల్ స్పేస్ డే సెలబ్రేషన్స్




మాట్లాడుతున్న డాక్టర్ సుబ్బారావు

చేబ్రోలు: కొత్త ఆవిష్కరణలు, ఉపగ్రహ ప్రాజెక్టులు, పరిశోధనలు యువతకు ప్రపంచ స్థాయి అవకాశాలను అందిస్తాయని హైదరాబాద్‌లోని అనంత్ టెక్నాలజీస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సుబ్బారావు పావులూరి అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో శుక్రవారం నేషనల్ స్పేస్ డే సెలబ్రేషన్స్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డాక్టర్ సుబ్బారావు పావులూరి మాట్లాడుతూ భారతదేశం అంతరిక్ష పరిశోధన రంగంలో సాధించిన విజయాలను స్మరించుకోవడమే కాకుండా, భవిష్యత్తు తరం శాస్త్రవేత్తలకు స్ఫూర్తినిచ్చే రోజు జాతీయ అంతరిక్ష దినోత్సవమని తెలియజేసారు. 2023 ఆగస్టు 23న చంద్రయాన్-3 మిషన్ ల్యాండర్ విక్రం చంద్రుడి ఉపరితలాన్ని తాకిన చారిత్రక సందర్భాన్ని గుర్తుగా చేసుకుంటూ, ఈ రోజును అధికారికంగా జాతీయ అంతరిక్ష దినోత్సవంగా జరుపుకుంటున్నారని వెల్లడించారు. అంతరిక్షం అంటే కేవలం గ్రహాలపై పరిశోధన కాదని, అంతరిక్ష సాంకేతికత నేరుగా ప్రజల జీవితాలపై ప్రభావం చూపుతోందన్నారు. పంటల ఉత్పత్తి అంచనాలు, నీటి వనరుల విశ్లేషణ, భూసార నాణ్యతా అధ్యయనాల్లో ఉపగ్రహ డేటా రైతులకు దోహదం చేస్తోందన్నారు.

విజ్ఞాన్ వర్సిటీలో జరిగిన నేషనల్ స్పేస్ డే సెలబ్రేషన్స్‌లో ఆంధ్రప్రదేశ్ స్పేస్‌టెక్ అకాడమీ (ఏపీఎస్ఏ)ను ఏర్పాటు చేశారు. ఈ కమిటీకు నూతన అధ్యక్షుడిగా అనంత్ టెక్నాలజీస్ లిమిటెడ్ చైర్మన్- మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పావులూరి సుబ్బారావు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 2025 మొదటి వారంలో అమరావతిలో తొలి ఏపీ స్పేస్‌టెక్ సమ్మిట్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. డిసెంబర్‌లో జరిగే స్పేస్‌టెక్ సమ్మిట్‌లో విద్యావేత్తలు, పరిశ్రమలు, పాలసీ మేకర్స్, ఆవిష్కర్తలు ఒకే వేదికపైకి చేరి జ్ఞానం పంచుకోవడం, సాంకేతిక పురోగతిని ప్రదర్శించడం, తదుపరి తరాన్ని ప్రేరేపించడం జరుగుతుందన్నారు. ఈ సమ్మిట్ ద్వారా అమరావతిపై గ్లోబల్ దృష్టి నిలుస్తుందని, అంతరిక్ష పరిశోధన, ఆవిష్కరణలు, వ్యాపారారంభాలకు ఇది ఒక కొత్త కేంద్రంగా ఎదుగుతుందని, అంతరిక్ష విప్లవంలో అగ్రగామిగా నిలవడానికి ఆంధ్రప్రదేశ్ కట్టుబాటును ఇది బలపరుస్తుందన్నారు. శ్రీహరికోటలోని మాజీ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ వి.శేషగిరి రావు మాట్లాడుతూ దూర ప్రాంతాలకూ టెలివిజన్, మొబైల్ సర్వీసులు, ఇంటర్నెట్ అందించడంలో అంతరిక్ష సాంకేతికత వంతెనలా పనిచేస్తోందన్నారు. దేశీయ ఉపగ్రహ నావిగేషన్ వ్యవస్థ రవాణా, రక్షణ, అత్యవసర సేవల్లో విశ్వసనీయ మార్గదర్శిగా నిలుస్తుందన్నారు. అంతరిక్షం పట్ల ఆసక్తి, ఆవిష్కరణ పట్ల నిబద్ధత, స్వయం సమృద్ధి పట్ల కాంక్ష – ఇవన్నీ కలిసి భారతదేశాన్ని రేపటి ప్రపంచ అంతరిక్ష శక్తిగా తీర్చిదిద్దుతున్నాయన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఐ.వీ.మురళీకృష్ణ, ఏఎస్‌టీసీ సెక్రటరీ సీ.ఎల్.నరసింహారావు, విట్ ప్రొఫెసర్ ఈ.శ్రీనివాస రెడ్డి, విజ్ఞాన్ వైస్ చాన్స్‌లర్ పీ.నాగభూషణ్, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, డీన్లు, తదితరులు పాల్గొన్నారు.